# నాయకత్వమూ, నిరశనవ్రతమూ

పో. శా.

వారంరోజులనుంచీ తిండిలేదు సుబ్రహ్మణ్యానికి. డొక్కలు 'యింత' లోతుకుపోయాయి. మొహం పాలిపోయింది. కళ్ళు గుంటలుపడ్డాయి. ఎన్ని ప్రాణాలిలా క్షోభించిపోతున్నాయో, కాని, బతికిచెడ్డ జీవంకాబోలు యీ పస్తులతో సుబ్రహ్మణ్యం ప్రాణాలు కళ్ళలోకి వచ్చాయి. ఇదివరకెప్పుడన్నా అవసరమొస్తే పస్తున్నాడు గాని—ఓ పూటో రెండు పూటలో—యిన్నాళ్ళు వరసగా పచ్చి మంచినీళ్ళతో గడపడం సుబ్రహ్మణ్యానికి యిదే ప్రథమ దఫా. మరి గత్యంతరం లేదు. అసలు అప్పుపుట్టే ఆస్కారం చూపుమేరలో ఎక్కడా గోచరించడంలేదు.

అప్పుడు తాను అంత 'ఇది' గా అందరికీ నాయకత్వం వహించి ఎందుకు తిరిగానా అని పశ్చాత్తాపపడుతున్నాడు. ఆ రోజుల్లో ఆ ఉద్రేకం ఒక లెక్కలోదా అనిపించింది. మిల్లులో చేరి మూడునెలలే అయినా అందరికన్నా తనే ఉత్సాహంతో ముందుకువచ్చి సమ్మె జరిపించాడు. ప్రప్రథమంగా తనకే సమ్మెబుద్ధి పుట్టిందా అంటే కాదు. తీరా జీతాలకోసం ఆందోళన జరుపుదాం జరుపుదాం అని హృదయాల్లో ఆశలు మొలకేసిన వాళ్ళంతా వెనక్కుజారేసరికి ఉన్న ఆత్మదార్ఢ్యాన్ని ఉపయోగించి తనే సమ్మె తనచేతులమీదుగా జయప్రదంగా కొనసాగించాడు. అందరికీ యిబ్బడిగా ముట్టాయి జీతాలు. మళ్ళీ పనిలో చేరిన మూడోనాడే మేనేజరు పిలిచాడు. వెళ్ళాడు. నీకు పని చేతకాదంటూ శ్రీముఖాన్ని చేతుల్లో పెట్టాడు కళ్ళెర్రజేసి మేనేజరు. సానుభూతి కూడా చూపలేకపోయారు మిగతా వర్కర్లంతా. అలాంటి నిర్దాక్షిణ్యుల్ని కూడగట్టుకొని సమ్మెను విజయోత్సాహంతో ముగించినందుకు తనకు ప్రతిఫలం యిది—వాళ్ళ కృతజ్ఞత అది. మిగతా వాళ్ళంతా నిక్షేపంగా పనులు చేసుకుంటూంటే తానుమాత్రం చేతులో పడేసిన జీతం డబ్బుల్తో మిల్లునుండి బయటపడాలిసివచ్చింది.

ఎన్నాళ్ళొస్తాయి ఆ నాలుగురాళ్ళూ? అయినా ఒకపూట తినీ తినకా, కొన్నాళ్ళు అర్ధాకలితో గడిపి నెలా పదిహేనురోజులు దాటేశాడు. తాను సమ్మెకు నాయకత్వం వహించాడన్న క్వాలిఫికేషను తనకు మరోచోట కూడు పుట్టకుండా చేసింది. తిరిగితిరిగి కాళ్ళరిగిపోయాయి. ఇవాళ యీనాటికి జేబూలో మూడణాలు మిగిలాయి. ఇటు అన్నానికి చాలవు అటు ఏమన్నా కొనుక్కుతిందామన్నా చాలవు. వారంనుంచీ అల్లాడుతున్న ఆకలిప్రేగులకు మూడణాలేమూలకు? ఎరిగున్నవాళ్ళంటూ లేరు—ఉన్నా కనబడాల్సి వస్తుందేమోనని మొహం దాటేస్తున్నారు. తనే వాళ్ళకు ఎదురై నిలవేసి కష్టాలు వెళ్ళబోసుకుందామనుకున్నా వెధవ ఆత్మాభిమానం కాళ్ళకు గుదిబండలు కడుతోంది. అంతకీ తెగించి ఒక సాయంకాలం మేనేజర్ని కలుసుకు ప్రాధేయపడ్డాడు. సనేమిరా కాదన్నాడు మేనేజరు.

ఏకాకి. 'నా' అనేవాడెవడూ లేడు. చస్తే పీడ వదులుంది. కాని స్వతంత్రభారతంలో నిరుద్యోగంతో అన్నార్తుడై చనిపోయాడనిపించుకోడం తనకూ తన మాతృభూమికీ కూడా అంత మంచిదికాదన్న భావం అతని హృదయంలో కలుక్కుమంటోంది. ఆ భావాన్ని వ్యక్తపరచినా వినే ఓపికా, విని అర్థంచేసుకొనే సహృదయత్వం ఎవరికున్నాయి?

చిరుగుపట్టిన చొక్కా జేబూలో ఓ మూలగా పడిఉన్నాయి మూడణాలూ. ఎక్కడికో నడిచిపోతున్నాయి కాళ్ళు. లోపలికి ఏమాత్రం 'ఎత్తు' పోకపోవడం మూలాన్న సుబ్రహ్మణ్యం తూగులాడిపోతున్నాడు.

రైల్వేస్టేషను మెట్లప్రక్క నెమ్మదిగా ఆలోచిస్తూ ఆగిపోయాడు. ప్రక్కనఉన్న గుంపు ఊరికే నాణాలను వెదజల్లుతోంది. గుంపుమధ్యగా 'లక్కీ ఛాన్స్, కాచిందానికి రెట్టింపు...' అని